## 'బడిబాట'పై పాట ఆవిష్కరణ

జనగామ చౌరస్తా, జూన్ 10: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంపై ప్రభుత్వ ఉపాధ్యాయులు రవీందర్, వసంత రాసి స్వరపరిచిన పాటను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం, నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ బోధన అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతూ మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. బడిబాటపై అద్భుతమైన పాటను రాసి స్వరపరిచిన గానసుధాకర్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రవీందర్, యశ్వంతాపూర్ ప్రాథమిక పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు వసంతను కలెక్టర్ అభినందించారు. డీఈవో కే రాము, జిల్లా సైన్స్ అధికారి గౌసియా బేగం, ఏఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



బడి బాట రికార్డింగ్ సాంగ్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సన్మానం


జనగామ చౌరస్తా, జూన్ 10: కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్‌ను కలెక్టరేట్‌లో సోమవారం టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన వరంగల్, భువనగిరి పార్లమెంట్ ఎన్నికల విధులను సజావుగా నిర్వహించి, విజయవంతం చేసిన ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజాషరీఫ్, పెండెం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉద్యోగులను సమన్వయపరచడంలో కలెక్టర్ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. టీఎన్జీవోస్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రాజనర్సయ్య, కోశాధికారి హఫీజ్, ఉపాధ్యక్షులు సంపత్ కుమార్, ఉప్పలయ్య, నాగార్జున, ప్రభాకర్, చందర్, శ్రీధర్, మధు, అబ్బాసొయిలు, విష్ణు, వినయ్ పాల్గొన్నారు.



కలెక్టర్ రిజ్వాన్ బాషాను ఘనంగా సన్మానిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా నాయకులు

## లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయాలి

చిల్పూరు, జూన్ 10 : మండలంలోని మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని మల్కాపూర్, లింగంపల్లి, కొండాపూర్, శ్రీపతిపల్లి గ్రామాల నాయకులు హనుమకొండలోని కనుకదుర్గ కాలనీలో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులు పదిహేను రోజుల్లో ప్రారంభించాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, కనుకంటి నరేందర్, ఏదునూరి రవీందర్, బుచ్చిరాజు, శ్రీనివాస్, సత్తయ్య, మారబోయిన ఎల్లయ్య, కనుకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన లింగంపల్లి, కొండాపూర్, శ్రీపతిపల్లి నాయకులు

# 'మీన' మేషాలేనా..

**ఉచిత చేప పిల్లల పంపిణీ లేనట్టేనా!**

- ప్రక్రియ మొదలు పెట్టని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఉపాధి కోల్పోతామని ఆందోళన చెందుతున్న మత్స్యకారులు
- విజయవంతంగా అమలు చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- గత ప్రభుత్వ పాలనలో మత్స్యకారులకు ఆర్థికభరోసా

జనగామ రూరల్, జూన్ 10: మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ లేనట్టేనా! ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేసిందా! అంటే పరిస్థితులు అవును అన్నట్లుగా కనిపిస్తున్నాయి. వానకాలం సీజన్ ప్రారంభమవుతున్నా ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం అవసరమైన చర్యలేవీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో మత్స్యకారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం కుల వృత్తులకు ఎంతో ప్రాధాన్యమివ్వగా, మత్స్యకారుల ఆర్థిక చేయూత కోసం వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేసింది. దీంతో గతంలో ఎప్పుడూ లేనివిధంగా మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. కేసీఆర్ ప్రభుత్వం 2016లో ఈకార్యక్రమం ప్రారంభించగా గత ఏడాది వరకు నిర్విరామంగా సాగింది. ఎనిమిది విడతలుగా చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లాలో సుమారు 732 చెరువులు, రిజర్వాయర్లు, కుంటలు ఉన్నాయి. గత ఏడాది ప్రభుత్వం 2.72కోట్ల చేపపిల్లలను వదలడమే లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో 170 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. అందులో సుమారు 17వేల మంది సభ్యులుగా ఉన్నారు. 35ఎంఎం నుంచి 100ఎంఎం వరకు ఉన్న చేప పిల్లలను రిజర్వాయర్లు, చెరువుల్లో వదిలేవారు. ఉచిత చేప పిల్లల పంపణీ ద్వారా మత్స్యసంపద భారీగా పెరిగి మత్స్యకారులకు ఆర్థిక భరోసా లభించేది. కానీ కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదు. అధికారులకు కూడా ఎలాంటి ఆదేశాలు లేవు.



శామీర్‌పేటలో ఉచిత చేపపిల్లలను చెరువులో వదులుతున్న మత్స్యకారులు (ఫైల్)

**మత్స్యకారులకు ఉపాధి**

ఉమ్మడి రాష్ట్రంలో చెరువులు, కుంటలు నిరాదరణకు గురయ్యాయి. పూడిక తీయక, నీటి నిల్వ తగ్గి మత్స్యకారులకు అంతగా ఉపాధి లభించలేదు. దీంతో కొందరు వలసలు పోగా మరికొందరు ఇతర పనులు చేసేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాగానే మిషన్ కాకతీయ కార్యక్రమంలో చెరువులు, కుంటల్లో పూడికతీత చేపట్టింది. దీంతో పుష్కలంగా నీరు నిలిచింది. ఆతర్వాత చేపపిల్లల పంపిణీ ఉచితంగా చేయగా మత్స్యకారులకు ఉపాధి లభించింది.

**పూర్తి కాని టెండర్లు**

కేసీఆర్ పాలనలో వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే చేప పిల్లల పంపిణీ కోసం ఏర్పాట్లు చేసేవారు. ఏప్రిల్‌లో టెండర్ల ప్రక్రియ చేపట్టి జూన్ మొదటి వారంలో పూర్తి చేసేవారు. ఆతర్వాత చేప పిల్లలను చెరువులు, కుంటల్లో వదిలేవారు. కానీ ఈసారి ఇంకా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదు. వర్షాలు కురుస్తున్నందున సెప్టెంబర్‌లోగా చేప పిల్లలు నీటిలో వేస్తేనే మంచి ఎదుగుదల ఉంటుంది. ఆలస్యమైతే చేపల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. అయినా ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని జిల్లా అధికారులు చెబుతున్నారు.

**దళారుల వ్యవస్థ రానుందా..**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు చేపల చెరువుల నిర్వహణకు దళారీ వ్యవస్థ ఉండేది. దళారుల వద్ద పెట్టుబడికోసం డబ్బులు తెచ్చుకునే వారు. దీంతో దళారీ చెప్పినట్లు నడుచుకోవాల్సి వచ్చేది. రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక పాత వ్యవస్థను రూపుమాపారు. ఉచిత చేపపిల్లల పంపిణీతో దళారీ వ్యవస్థ లేకుండా పోయింది. ఇప్పుడు ఉచిత చేప పిల్లల పంపిణీ ఆగిపోతే మత్స్యకారులు మళ్లీ ఇబ్బందులు పడనున్నారు. దళారీ వ్యవస్థ మళ్లీ వచ్చే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఎలాంటి ఆదేశాలు రాలేదు



మత్స్యకారులకు ఉచిత చేపపిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రాగానే తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే చాలామంది మత్స్యకార సంఘాలు, మత్స్యకారులు అడుగుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని చెబుతున్నాం.

*– బానోత్ నాగులు, జిల్లా మత్స్యశాఖ అధికారి, జనగామ*

### వెంటనే పంపిణీ చేపట్టాలి



గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేయాలి. లేకుంటే మా కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతాయి. ప్రస్తుతం చేపలు పట్టుకొని జీవిస్తున్నాం. ఈ పని లేకుంటే కుటుంబాన్ని సాదుకోవడం కష్టమే. ప్రభుత్వం స్పందించి వెంటనే ఉచిత చేపపిల్లల పంపిణీ చేపట్టాలి.

*– నిమ్మల స్వామి ముదిరాజు, మత్స్యపారిశ్రామిక జిల్లా డైరెక్టర్, శామీర్‌పేట, జనగామ మండలం*



కామారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హుస్సేన్, సీఐ మహేందర్‌రెడ్డి

## 'డబుల్' ఇళ్లలో ప్రవేశాలపై విచారణ

దేవరుప్పుల, జూన్ 10: మండలంలోని ధర్మాపురం, కామారెడ్డిగూడెం, కడవెండి గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు ప్రవేశించడంపై తహసీల్దార్ హుస్సేన్, పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తయినప్పటికీ ఇవ్వకపోవడంతో కామారెడ్డిగూడెం, ధర్మాపురం, కడవెండి గ్రామాల్లో ఇటీవల అదే గ్రామాలకు చెందిన కొన్ని కుటుంబాలు ప్రవేశించి నివసిస్తున్నాయి. దీనిపై గ్రామానికి చెందిన కొందరు అధికారుల దృష్టికి తేగా సోమవారం విచారణ చేపట్టారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివసిస్తున్న వారికి అవగాహన కల్పించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రభుత్వం నిర్వహిస్తుందని, గ్రామసభలు నిర్వహించి ఇళ్లు లేని అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వారి పేర కలెక్టర్ ఉత్తర్వుల పత్రాలను అందిస్తారని పేర్కొన్నారు. అప్పటివరకు ఎవరూ ప్రవేశించొద్దని, ఎవరైనా వాటిల్లో ఉంటే వెంటనే ఖాళీ చేయాలన్నారు. లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఎస్సై చెన్నకేశవులు, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ ఉన్నారు.

## 'మిషన్‌భగీరథ'పై ట్రైనింగ్



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో అనిల్‌కుమార్

చిల్పూరు/బచ్చన్నపేట, జూన్ 10: చిల్పూరు మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ పథకంపై మండల స్థాయి ట్రైనింగ్ నిర్వహించారు. జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో అనిల్‌కుమార్ మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోలు హాజరయ్యారు. మిషన్ భగీరథ వాటర్ గ్రామాల్లో ప్రజలకు ఎలా వస్తుంది? ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్లాలు ఎన్ని ఉన్నాయి? అని వివరించారు. డీఎల్‌పీవో వెంకటప్రసాద్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో మధుసుదనాచారి, పంచాయతీ కార్యదర్శులు శషి కుమార్, శ్రీకాంత్, రంగారెడ్డి, అజిజ్‌పాషా, రామ్‌బాబు పాల్గొన్నారు. బచ్చన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రఘురామకృష్ణ అధ్యక్షతన మిషన్ భగీరథ నల్లాలపై నిర్వహించే సర్వేపై అవగాహన కల్పించారు. డీపీఎం మహేందర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు రోజూ 30కి పైగా ఇళ్లు తిరిగి ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయాలన్నారు. సర్వే పది రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనిల్‌రాజ్, భాను, కవిత, రూపాచైతన్య, రాజశేఖర్, కిరణ్, కరుణాకర్, సౌజన్య, మధు, ప్రశాంత్‌ఆచార్య, ప్రశాంత్, దేవిప్రసాద్, భరత్, సతీష్‌రెడ్డి, వెంకట్, కవిత, యాదలక్ష్మి, కవిత, రాజేశ్వర్, బాబుగౌడ్, రాజు, సిద్ధార్థ, మానస, పర్వతం లక్ష్మి, శ్యామల, అశోక్, మురళి, భారతి, శ్రీనివాసాచారి, రవికుమార్, సిద్ధేశ్వరి పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

పాలకుర్తి, జూన్ 10: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య అన్నారు. సోమవారం మండలంలో వావిలాల జడ్పీహెచ్ఎస్, వల్మిడి ఎంపీపీఎస్ ఆధ్వర్యంలో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఎంతోమంది నేడు గొప్పస్థాయిలో ఉన్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు దొంకురు రాములు, ఉపాధ్యాయులు హరిత, సరిత, తిరుమలదేవి, హరిప్రియ, సోమమల్లయ్య, కొండయ్య పాల్గొన్నారు.



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

## హత్య కేసు కొట్టివేత

బచ్చన్నపేట, జూన్ 10: మండలంలోని దబ్బగుంటపల్లికి చెందిన పంతం శ్రీనివాస్ హత్య కేసు కొట్టేస్తూ సోమవారం జనగామ తజిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలను ఎస్సై సతీష్ వెల్లడించారు. గ్రామానికి చెందిన పంతం బాలమణి 2018లో భర్త శ్రీనివాస్‌ను వ్యవసాయ బావి వద్ద పిల్లల సాయంతో హత్య చేసినట్లు కేసు నమోదైంది. కొన్నాళ్లు జైలుకు వెళ్లి వచ్చింది. ఇన్నాళ్లు కొనసాగిన ఈ కేసు పూర్వాపరాలు విన్న బాలమణి నిర్దోషిగా ప్రకటిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై వెల్లడించారు. న్యాయవాది చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ జనగామ జిల్లా న్యాయవాది మంచాల రవీందర్ నిందితుల తరపున వాదించినట్లు చెప్పారు.

## స్నేహితురాలికి ఆర్థికసాయం

నర్మెట, జూన్ 10: పదోతరగతి కలిసి చదివిన తోటి విద్యార్థికి తమ వంతు ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1998–99వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థి గొడుగు కవిత భర్త మృతిచెందగా తోటి స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.25వేల ఆర్థికసాయం అందించారు. చిర్ర మహిపాల్‌రెడ్డి, ప్రజ్ఞాపురం రమేశ్, బానోత్ శ్రీనివాస్, నరేష్, కర్ణాకర్, నరేశ్, మల్లేశ్, భాగ్య, నాగేష్, ప్రతిభ, స్వప్న, రాజమణి, కుమార్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి..

నర్మెట, జూన్ 10: మండల కేంద్రానికి చెందిన పిన్నోజు కృష్ణ ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, డీసీసీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహ్మారెడ్డి సోమవారం పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, మహిళా మండల అధ్యక్షురాలు దేవులపల్లి భాగ్యలక్ష్మి, గ్రామ అధ్యక్షురాలు పులి రేణుక, యూత్ గ్రామ అధ్యక్షుడు పల్లె ప్రభుదాస్, గోపగోని నరేష్, వలబోజు శ్రీనివాస్, గొట్టె రాజశేఖర్, బత్తుల కర్ణాకర్, తీగుళ్ల భూపతిరెడ్డి, గడ్డం రవి, దయాకర్, పిన్నోజు ప్రవీణ్ పాల్గొన్నారు.

## రైతు బీమాను రెన్యువల్ చేసుకోవాలి

జఫర్‌గఢ్, జూన్ 10 : రైతు బీమా పథకాన్ని రైతులందరూ రెన్యువల్ చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారులు ప్రశాంత్, శిరీషా ఒక ప్రకటనలో సోమవారం కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వ్యవసాయాధికారులు బీమాను రెన్యూవల్ చేస్తున్నట్లు తెలిపారు. రైతు బీమా పథకంలో గతంలో బీమా ఉన్న రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్‌లను అందించాలని కోరారు.

## శ్రీమన్నారాయణపురంలో కప్పతల్లి ఆట

రఘునాథపల్లి, జూన్ 10: మండలంలోని శ్రీమన్నారాయణపురంలో వరుణ దేవుడు కరుణించి వర్షం కురవాలని మహిళలు కప్పతల్లి ఆట ఆడారు. రోకలిబండకు కప్పను కట్టి చిన్నారులు మోసుకుంటూ పాటలు పాడుతూ గ్రామంలో ఇంటింటికీ తిరగ్గా మహిళలు కప్పతల్లికి బిందెలతో నీరు పోశారు. వర్షం కురవాలని పూజలు చేశారు.



కప్పతల్లి ఆట ఆడుతున్న మహిళలు

## ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగాలు

జనగామ చౌరస్తా, జూన్ 10 : అగ్నిపథ్ పథకం కింద ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు ఉద్యోగాల కోసం వివాహం కాని స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 28 రాత్రి 11 గంటల వరకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు agnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అంతర పంటలతో అధిక లాభాలు

కొడకండ్ల, జూన్ 10: కంది, పత్తి వంటి అంతర పంటలు వేసుకొని అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హక్యతండాలో క్షేత్రస్థాయి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తనాలు వేసిన 48గంటల్లోగా ప్రీ ఎమర్జెన్సీ హెర్బి సైడ్ స్ప్రే చేసుకోవాలని, తద్వారా కలుపును నియంత్రించవచ్చని చెప్పారు. అంతర పంట వేసుకోవడం ద్వారా భూమిలో నత్రజని శాతం పెరుగుతుందని అన్నారు. ఏఈవో నవ్య, రైతులు పాల్గొన్నారు.

## నేడు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ లక్కీడ్రా

జనగామ చౌరస్తా, జూన్ 10 : కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి కే దయానందరాణి సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుపేద ఎస్సీ విద్యార్థులకు ఈ స్కీమ్ ద్వారా 1వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశం కల్పించేందుకు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారిలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు డ్రాలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట, జూన్ 10 : మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి గద్దల కిశోర్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఆల్వాల రాజు అధ్యక్షతన రెండు కమిటీలను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మేడి రాజు, ఉపాధ్యక్షులుగా ఏకాంత, ప్రధాన కార్యదర్శిగా గిద్దెల ఏకాంత్, సహాయ కార్యదర్శిగా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

## ఐటీఐ ప్రవేశాల గడువు 14 వరకు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, జూన్ 10 : ఐటీఐల్లో ప్రవేశాలకు ఈ నెల 14 వరకు దరఖాస్తులను పొడిగించినట్లు వరంగల్ బాలుర ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జూమ్లానాయక్ తెలిపారు. అభ్యర్థులు iti.telangana.gov.inలో దరఖా స్తు చేసుకోవాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు.

## వైద్యుల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 10 : సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసినితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి, వార్డును పరిశీలించి, అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరు, అందుతున్న సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి ఎనిమిది మంది వైద్యులకు గాను ముగ్గురే హాజరు కాగా, సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫోన్ చేసి విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆస్పత్రిలో స్త్రీలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఆస్పత్రికి డయాలసిస్ సెంటర్ మంజూరైందని, త్వరలోనే వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే తనిఖీకి వచ్చిన విషయం తెలుసుకున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి చేరుకున్నారు.



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**మృతుడి కుటుంబానికి పరామర్శ**

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల దామోదర్ మామ మేరుగు నర్సయ్య (80) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నపెండ్యాల ఎంపీటీసీ తాళ్లపెల్లి ఉమా సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఇల్లందుల యాదగిరి, మాజీ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, మాజీ సర్పంచ్ తాళ్లపెల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

## దశాబ్ది డిపాజిట్ పథకంతో అత్యధిక వడ్డీ

కొడకండ్ల, జూన్ 10: తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకంతో అత్యధిక వడ్డీ పొందవచ్చని డీసీసీబీ కొడకండ్ల బ్రాంచ్ మేనేజర్ నాతి కల్యాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా రూ.5లక్షల వరకు డిపాజిట్ చేసి, అత్యధికంగా 8.10 శాతం వడ్డీ పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశం సెప్టెంబర్ 1వరకు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. నెలవారీ, త్రైమాసిక వడ్డీ సౌకర్యం ఉందని తెలిపారు.

## సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

చిల్పూరు, జూన్ 10: సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. నాయబ్ తహసీల్దార్ విమలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలను పర్కిరించాలని, సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్‌పై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. మండలంలోని రైతులకు చెందిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బోనగిరి కుమార్, ఆపరాదపు రాజు, గుంటి భీమయ్య, మహేశ్, చిన్న ఐల్లయ్య,శంకర్, సమ్మయ్య, రాజు, మల్లయ్య, రవి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రఘునాథపల్లి, జూన్ 10: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని నిడిగొండ బ్రిడ్జి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మహ్మద్ కైసర్‌పాషా(35) కుటుంబసభ్యులు రఘునాథపల్లి మండల కేంద్రంలో బంధువుల ఇంట్లో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి అదే రాత్రి జనగామకు మహ్మద్ కైసర్ బైక్‌పై ముందు వెళ్తుండగా కుటుంబసభ్యులు కారులో వెనుక వెళ్తున్నారు. ఈ క్రమంలో నిడిగొండ బ్రిడ్జి వద్దకు రాగానే కైసర్ బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. అతడి తలకు తీవ్రగాయాలు కాగా, కుటుంబ సభ్యులు చికిత్స కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కైసర్‌పాషా (ఫైల్)

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- 'గ్రీవెన్స్ సెల్'లో కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ప్రజల నుంచి 21 వినతిపత్రాల స్వీకరణ

జనగామ చౌరస్తా, జూన్ 10 : ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్ కుమార్ లలిత్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి 21 వినతిపత్రాలను స్వీకరించారు. గృహజ్యోతి పథకంలో ప్రజాపాలన దరఖాస్తు చేసినప్పటికీ ఇంటికి జీరో కరెంట్ బిల్లు రావడంలేదని జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డకు చెందిన ఎండీ ఫాకేర బేగం, తనను కొడుకులు, కూతురు పోషించకుండా తన పేర ఉన్న భూమిని రాసివ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని పట్టణంలోని కుర్మవాడకు చెందిన సాధన భూలక్ష్మి అనే 88 ఏళ్ల వృద్ధురాలు, వారసత్వంగా రావాల్సిన 9ఎకరాల 37గుంటల భూమిలో 3 ఎకరాలకు మాత్రమే పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిందని, మిగతా 6.37గుంటల భూమిని మరొకరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, కోర్టుకు వెళ్లి నోటీసులు తెస్తే, సదరు వ్యక్తి అమెరికాకు వెళ్లాడని, అధికారులు న్యాయం చేయాలని జఫర్‌గఢ్ మండలం కూనూరుకు చెందిన రైతు పల్లపాటి బుచ్చిరెడ్డి, తండ్రి పేర ఉన్న భూమిని రికార్డులో నమోదు చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన సింగపురం రాజు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం జారీపై విచారణ జరపాలని జనగామ మండలం అడవి కేశవాపూర్‌కు చెందిన అరుణ్ కుమార్, బచ్చన్నపేట మండలం చిన్నరామచర్లలో తాము లేకపోవడంతో గ్రామంలో తనకున్న 3 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమిని కొందరు కబ్జా చేశారని, దీనిపై విచారణ జరిపించాలని రామగళ్ల విమలమ్మ, రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరిలో తమ భూమికి హద్దురాళ్లను నిర్ణయించాలని పలువురు రైతులు కలెక్టర్‌కు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్ర విచారణ జరపాలన్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించాలన్నారు. భూ సమస్యలను వెంటనే విచారణ జరిపి పరిష్కరిస్తామని, కోర్టు పరిధిలోని భూ సమస్యలపై బాధితులు కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) సుహాసిని, డీఈవో కే రాము, సివిల్ సప్లై అధికారి రోజారాణి, డీపీవో వినోద్‌కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ కేఆర్ లత, మత్స్యశాఖ అధికారి నాగులు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి దయానందరాణి, బీసీ అభివృద్ధిశాఖ అధికారి బీ రవీందర్, లేబర్ అధికారి ఆర్ కుమారస్వామి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted Experience (M&F) Local & Kerala Teachers for Primary Hindi, English higher section Hindi Good Salary for fluent English, ELOHIM SCHOOL, Kommala, Wgl. 9390112329, 7702026999.
NTW-318919

CHANGE OF NAME

★I, GOPAGONI RAVI, S/o. GOPAGONI SAYABJILLA, R/o. H.No. 5-79, Main Road, Narmetta (V&M), Jangaon Dist., T.S., My Father Name is GOPAGONI SAYABJILLA alias SAYABJEELA is one and the same all further purposes.
NTW-5698

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565